జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 14 | మే | 2026 • పేజీలు : 6

## చిరకాల స్వప్నం నెరవేరింది

- నేడు మంత్రి తుమ్మల చేతుల మీదుగా ఉద్యానవన కళాశాల ప్రారంభం
- ఉద్యానవన కళాశాలతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల పర్యటనను విజయవంతం చేయండి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



అశ్వారావుపేట, మే 13, ప్రజాజ్యోతి : ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన ఉద్యానవన కళాశాల నేడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభం కానుందని,ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు.ఆయిల్ ఫామ్ ప్యాక్టరీ ఆవరణలో

మిగతా 2 లో...



## మొక్కజొన్న కొనుగోళ్లలో ...
# మాఫియా మాయాజాలం?

- రైతులకు నిరీక్షణల నరకం... వ్యాపారులకు వివిపీ సదుపాయాలు!
- పగలు రైతుల క్యూలు
- రాత్రిళ్లు దొడ్డి దారిలో వ్యాపారుల లారీలు?
- పీఏసీఎస్ సిబ్బంది పాత్రపై అనుమానాలు?
- ఓ ప్రధాన వ్యక్తి హస్తం ఉన్నట్టు ఆరోపణలు!
- కలెక్టర్ తనిఖీలతో కలకలం
- మరింత నిఘా పెడితే బహిర్గతం కానున్న నిజాలు

ఇల్లందు, మే 13, ప్రజాజ్యోతి:మొక్కజొన్న కొనుగోళ్లలో భారీ గోల్ మాల్ జరుగుతుందన్న ఆరోపణలు ఇల్లందు పరిసర ప్రాంతాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రైతులు రోజుల తరబడి మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తూ తమ పంటను అమ్ముకునేందుకు ఎదురుచూస్తుండగా వ్యాపారులు మాత్రం దొడ్డి దారిలో తమ మొక్కజొన్నను విక్రయిస్తూ అధికార యంత్రాంగాన్ని మోసం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు రైతుల నుంచి "తేమ ఎక్కువగా ఉంది", "స్లాట్ లేదు", "టోకెన్ రావాలి" అంటూ కొనుగోళ్లు ఆలస్యం చేస్తున్న అధికారులు, మరోవైపు వ్యాపారుల



సరుకును రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో పీఏసీఎస్ సిబ్బంది

మిగతా 2 లో...

## బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా

### రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 13 (ప్రజాజ్యోతి): రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ బుధవారం జిల్లా స్థాయి పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, అదనపు డీసీపీలు, ఏసీపీలు,డీఎస్పీలు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, పరస్పర సహకారంతో జరుపుకునేలా పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రార్థనా స్థలాలు, ఈద్గాలు, మసీదులు, ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు మరియు జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.పండుగ రోజున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి, వాహన రాకపోకలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈద్గాల వద్ద పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ మళ్లింపులు

మిగతా 2 లో...

## పాల్వంచలో హృదయ విదారక ఘటన

- బొల్లోరిగూడెంలో కుక్కల నోట పసి కందు తలభాగం... స్థానికుల్లో తీవ్ర ఆందోళన
- సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రజల డిమాండ్



పాల్వంచ, మే 13 (ప్రజాజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని బొల్లోరిగూడెం ప్రాంతంలో బుధవారం వెలుగులోకి వచ్చిన ఓ హృదయ విదారక ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. గుర్తు తెలియని పసికందుకు చెందిన తల భాగాన్ని కుక్కలు పీక్కు తింటుండగా గమనించిన స్థానికులు వాటిని తరిమికొట్టారు. అనంతరం శునకాలు అక్కడి నుంచి పారిపోవడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అక్కడ కనిపించిన దృశ్యాలను

మిగతా 2 లో...

## మావోయిస్టుల భారీ ఆయుధాలు స్వాధీనం

- రూ.65.52 లక్షల నగదు, 32 ఆయుధాలు, పేలుడు పదార్థాల స్వాధీనం



చర్ల ,మే 13:(ప్రజా జ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులపై భద్రతా బలగాలు భారీ విజయాన్ని నమోదు చేశాయి. బీజాపూర్ పోలీస్, డీఆర్ జీ, ఎస్ టీ ఎఫ్ , కోబ్రా , సీఆర్ పీఎఫ్ బలగాలు సంయుక్తంగా నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్లలో మావోయిస్టుల పాత డంపుల నుండి భారీ మొత్తంలో నగదు, ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలు నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి.భద్రతా బలగాల తాజా చర్యలో రూ.65.52 లక్షల నగదు లభించగా, 2024 నుండి ఇప్పటివరకు జరిగిన మొత్తం ఆపరేషన్లలో రూ.7.2852 కోట్ల నగదు, రూ.12.80 కోట్ల విలువైన 08.20 కిలోల బంగారం సహా మొత్తం రూ.20.08 కోట్ల విలువైన ఆస్తులను రికవరీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.గత నెల రోజులుగా బీజాపూర్ జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్లలో

మిగతా 2 లో...

## మావోయిస్టుల భారీ ఆయుధాలు స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి...)

ఎల్ ఎమ్ జీ , ఎస్ ఎల్ ఆర్ , కార్బైన్ రైఫిల్లు సహా మొత్తం 32 ప్రమాదకర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. 2024 నుండి ఇప్పటివరకు మొత్తం 517 ఆయుధాలను భద్రతా బలగాలు రికవరీ చేసినట్లు తెలిపారు.జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ మాట్లాడుతూ, కేంద్ర , ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యానికి అనుగుణంగా బీజాపూర్ జిల్లాను నక్సల్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రత్యేక నక్సల్ నిర్మూలన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామస్తుల సహకారం, పటిష్టమైన నిఘా సమాచారంతో అడవుల్లో దాచిన మావోయిస్టు డంపులను గుర్తించి ఈ విజయాన్ని సాధించామని పేర్కొన్నారు.ఈ ఆపరేషన్ లో స్వాధీనం చేసుకున్న ఆయుధాల్లో ఎల్ ఎమ్ జీ రైఫిల్, ఎస్ ఎల్ ఆర్ రైఫిళ్లు, కార్బైన్ రైఫిల్, .303 రైఫిళ్లు, .315 రైఫిల్, సింగిల్ షాట్ గన్స్, 12 బోర్ గన్స్, బీజీఎల్ లాంచర్లు, 08 ఎంఎం పిస్టల్, బోల్ట్ యాక్షన్ ఆయుధాలు ఉన్నాయి. అలాగే ఏకే-47, ఎస్ ఎల్ ఆర్, .303, .315 రైఫిళ్లకు చెందిన వందల సంఖ్యలో లైవ్ కార్ట్రిడ్జ్ లు, బీజీఎల్ సెల్స్ పేలుడు పదార్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఐఈడీ తయారీ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.ఇటీవల పామేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవర్గుట్ట అడవుల్లో స్వాధీనం చేసుకున్న 40 కిలోల అమ్మోనియం నైట్రేట్ తో పాటు నేషనల్ పార్క్ ప్రాంతంలో లభించిన 100 కిలోల అమ్మోనియం నైట్రేట్, యూరియాను భద్రతా ప్రమాణాల ప్రకారం ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ చర్యలతో మావోయిస్టుల లాజిస్టిక్ సరఫరా వ్యవస్థ, ఆయుధాల సరఫరా నెట్ వర్క్ ఐఈడీ తయారీ సామర్థ్యానికి తీవ్ర దెబ్బ తగిలిందని భద్రతా బలగాలు పేర్కొన్నాయి.అధికారుల గణాంకాల ప్రకారం 2024 నుంచి భద్రతా ఆపరేషన్లలో 234 మంది మావోయిస్టులు హతమవ్వగా, 1,192 మందిని అరెస్టు చేశారు 1,003 మంది నక్సలైట్లు లొంగిపోయారు. ఇదే కాలంలో, 517 ఆయుధాలు, 1,092 ఐఈడీలు. ₹20,085,200 విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ₹7.28 కోట్ల నగదు ₹12.80 కోట్ల విలువ ఉంటుందని అంచనా వేయబడిన 8.20 కిలోల బంగారం కూడా ఉన్నాయి. ఏదైనా అనుమానాస్పద వస్తువు, పేలుడు పదార్థం లేదా అనుమానాస్పద కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు, భద్రతా దళాలకు తెలియజేయాలని పోలీసులు ప్రజలకు గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

## పాల్వంచలో హృదయ విదారక ఘటన

(మొదటి పేజీ తరువాయి...)

చూసి స్థానికులు, పోలీసులు షాక్ కు గురైనట్లు తెలిసింది.పసికందు అవశేషాలు అక్కడికి ఎలా వచ్చాయి..? ఈ దారుణానికి పాల్పడింది ఎవరు..? అనే ప్రశ్నలు స్థానికుల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఇది నవజాత శిశువా..? పుట్టిన వెంటనే ఎవరైనా నిర్దాక్షిణ్యంగా విసిరిపారేశారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు స్థానికులు ఇది ఆడశిశువు అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తుండగా, అధికారికంగా మాత్రం పోలీసులు ఎలాంటి నిర్ధారణ చేయలేదు. ఘటన జరిగిన ప్రాంతంలో దుర్వాసన వ్యాపించడంతో సమీప నివాసితులు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు ఘటనాస్థలిలో ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్ ను పరిశీలించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.సమాజాన్ని కలచివేసే ఇటువంటి అమానుష ఘటనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పసికందు మృతికి గల కారణాలు ఏమిటి..? దీనికి బాధ్యులు ఎవరు..? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి నిజాలను వెలుగులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.ఆడపిల్లగా పుట్టిందనే కారణంతో ఇలాంటి దారుణాలకు పాల్పడటం సమాజానికి మచ్చ అని మహిళా సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవజాత శిశువుల రక్షణ, మహిళా శిశు సంక్షేమంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## చిరకాల స్వప్నం నెరవేరింది

(మొదటి పేజీ తరువాయి...)

జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, ఉద్యానవన కళాశాల స్థాపనతో అశ్వారావుపేట ప్రాంతానికి విద్యా, వ్యవసాయ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఉద్యానవన విద్య అందుబాటులోకి రావడంతో పాటు రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెరుగుతుందని చెప్పారు.కళాశాల ప్రారంభంతో ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఎమ్మెల్యే జారే అభిప్రాయపడ్డారు. నేడు జరుగనున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల పర్యటనను విజయవంతం చేయాలని ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆయన కోరారు.సాయంత్రం 4 గంటలకు ఉద్యానవన కళాశాల ప్రారంభోత్సవం అనంతరం రైతు సమ్మేళనం ఉంటుందని అభిమానులు కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అయిల్ ఫెడ్ సీనియర్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ నిర్మల పుల్లారావు, సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, తుమ్మ రాంబాబు, బండి భాస్కర్, జూపల్లి ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో ...
# మాఫియా మాయాజాలం?

(మొదటి పేజీ తరువాయి...)

కొందరి హస్తం ఉందని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.





### ››› రైతుల ఆవేదన

కొనుగోలు కేంద్రాల వద్ద వర్షాలు, ఎండలను లెక్కచేయకుండా రైతులు రోజుల తరబడి వేచి చూస్తున్నారు. ట్రాక్టర్లు, ఆటోలు, లారీలలో మొక్కజొన్న తీసుకొచ్చి యార్డులో నిలిపి ఉంచినా కొనుగోళ్లు జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తేమ శాతం పేరుతో రైతుల సరుకును తిరస్కరిస్తున్న అధికారులు, అదే సమయంలో వ్యాపారుల ధాన్యాన్ని సులభంగా అనుమతిస్తున్నారన్న ఆరోపణలు పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తున్నాయి.

### ››› వ్యాపారులకే ప్రత్యేక సౌకర్యాలు?

స్థానికంగా కొందరు వ్యాపారులు రైతుల పేర్లతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు సరుకు తరలిస్తున్నారని సమాచారం. రాత్రి సమయాల్లో లారీల ద్వారా గుట్టుగా మొక్కజొన్న తరలింపులు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో సాధారణ రైతుకు అమలు చేస్తున్న నిబంధనలు వ్యాపారుల విషయంలో మాత్రం కనిపించడం లేదని రైతులు మండిపడుతున్నారు.

### ››› పీఏసీఎస్ సిబ్బందిపై ఆరోపణలు?

ఈ మొత్తం వ్యవహారంలో పీఏసీఎస్ కు చెందిన కొందరు సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపారులతో కుమ్మక్కై రైతుల అవకాశాలను దెబ్బతీస్తున్నారని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. టోకెన్ల కేటాయింపు నుంచి తూకం, నిల్వల వరకు అన్నింటిలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతుంది. సాధారణంగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు మొక్కజొన్నలను విక్రయిస్తే ఆ డబ్బులు వచ్చేసరికి కొంత సమయం పడుతుండడం వాస్తవం. ప్రభుత్వం, అధికారులు డబ్బులు కొంత ఆలస్యమైనప్పటికీ రైతులు పండించిన మొక్కజొన్నను కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయాలు జరపాలని సూచిస్తుంది. కానీ రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు సుమారుగా రూ 1700 నుండి 1800 రైతులకు ఇస్తామని, తూకం పూర్తయ్యాక ఆ డబ్బులను వారం నుండి పది రోజుల్లో మీకు చెల్లిస్తామని చెప్పి వారు పండించిన మొక్కజొన్నలను కొనుగోలు చేయడం జరుగుతుంది. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన మొక్కజొన్నను పిఎసిఎస్, ఓ ప్రధాన వ్యక్తి హస్తంతో గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రి భారీ వాహనాలలో గోడౌన్ లకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మొక్కజొన్న కొనుగోలు చేసే సమయంలో ఆన్లైన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సదరు రైతులకు ముందుగా ఒప్పందం చేసుకున్న ధర ప్రకారం డబ్బులను ఇస్తున్నట్లు తెలుస్తుంది. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నారని, రైతులను పట్టించుకోవడం లేదనే రైతుల నుంచి వరుస ఫిర్యాదులు రావడంతో జిల్లా కలెక్టర్ బుధవారం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించినట్లు సమాచారం. కేంద్రాల్లో నిల్వలు, తూకం విధానం, కొనుగోలు ప్రక్రియపై ఆరా తీసిన కలెక్టర్ సంబంధిత అధికారులను వివరణ కోరినట్లు తెలిసింది. దీంతో కేంద్రాల వద్ద ఒక్కసారిగా కలకలం రేగింది.

### ››› కలెక్టర్ ఆదేశాలతో గోడౌన్ లకు తరలుతున్న మొక్కలు

జిల్లా కలెక్టర్ అంకిత్ ఇల్లందు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను సందర్శించి భారీగా నిల్వలు ఉండడంతో వెంటనే గోడౌన్ లకు మొక్కజొన్నలను తరలించాలని ఆదేశాలు జారీ చేయడంతో లారీల ద్వారా మొక్కజొన్నలను రవాణా చేయడం జరుగుతుంది. ఇన్ని రోజుల నుండి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తూ వారి ధాన్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో మొక్కజొన్న తరలించటంతో రైతులు కొంత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్నను కార్పన్లతో తడవకుండా జాగ్రత్తలు వహించినప్పటికీ కొందరి రైతుల మొక్కజొన్నలు తడిసి మొలకలు రావడం వల్ల రైతులు కన్నీరు పెడుతున్నారు. మరల వాటిని వేరే గన్ని బ్యాగులలో నింపితే మరికొంత మొక్కజొన్న తూకం తగ్గే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› నిఘా పెడితే నిజాలు వెలుగులోకి?

కొనుగోలు కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు, విజిలెన్స్ తనిఖీలు, రాత్రి పర్యవేక్షణ చేపడితే అసలు గోల్ మాల్ బయటపడే అవకాశముందని రైతులు అంటున్నారు. రైతుల కష్టార్జిత పంటకు న్యాయం చేయాలని, వ్యాపార మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను రైతులు కోరుతున్నారు.

## బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా

(మొదటి పేజీ తరువాయి...)



అత్యవసర సేవల కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చెందకుండా సైబర్ మానిటరింగ్ ను మరింత బలోపేతం చేయాలని డీజీపీ ఆదేశించారు. అనుమానాస్పద సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.అదేవిధంగా మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులతో ముందస్తు సమావేశాలు నిర్వహించి సామరస్య వాతావరణంలో పండుగను జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల పర్యవేక్షణతో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని తెలిపారు.ఇప్పటికే ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద 24 గంటలపాటు సిబ్బంది విధులు నిర్వహించాలని, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పండుగ విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, ఎక్కడైనా చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని డీజీపీ సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో పాటు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, ఎస్బీ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రవాణా, గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి
- మొక్కజొన్న కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయి పరిశీలన
- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్





**ఇల్లందు, మే 13, ప్రజాజ్యోతి:** జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ఇల్లందు వ్యవసాయ కమిటీ, చల్లసముద్రం, టేకులపల్లి, బోడు లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి కొనుగోలు, నిల్వ, లోడింగ్, రవాణా ప్రక్రియలపై సమీక్ష నిర్వహించారు. మొదటగా ఇల్లందు వ్యవసాయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ నిల్వ ఉంచిన మొక్కజొన్న బ్యాగులు, కొనుగోలు వివరాలు, గోదాముల సామర్థ్యం, హమాలీల అందుబాటు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్రంలో 54 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ కమిటీ ప్రాంగణంలోని గోదాముల్లో సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు గాను స్థానిక కూలీల ద్వారా అదనపు లోడింగ్ పనులు చేపడుతున్నామని అధికారులు కలెక్టర్‌కు తెలియజేయగా, రోజువారీ చెల్లింపులు వెంటనే చేపట్టి లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ నిల్వ స్థలాల కొరత నివారణకు గిరిజన భవనాలు, కళాశాలల ఫంక్షన్ హాల్స్ వంటి ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. రవాణా ప్రక్రియ వేగవంతం చేసేందుకు ట్రాక్టర్లు, డీసీఎంలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. రెండు రోజుల్లో లోడింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రేపల్లెవాడలోని చల్లసముద్రం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులు సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడం, గన్ని బ్యాగుల కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన కలెక్టర్ జిల్లా రవాణా శాఖ అధికారులతో మాట్లాడి తగినన్ని లారీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే గన్ని బ్యాగుల కొరతపై డీఎం మార్క్ ఫెడ్ అధికారులతో మాట్లాడి వెంటనే 50 వేల గన్ని బ్యాగులు సరఫరా చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో 17 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొమరారం కొనుగోలు కేంద్రంలోని నిల్వలను కూడా కారేపల్లి గోదాములకు తరలిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కారేపల్లిలో 5 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉన్నందున అక్కడ నిల్వలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం టేకులపల్లి మండలంలో కలెక్టర్ పర్యటించి టేకులపల్లి వ్యవసాయ కమిటీ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలోని మొక్కజొన్న నిల్వలు, రవాణా సదుపాయాలు, హమాలీల అందుబాటు, గోదాముల పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్రంలో సుమారు 1,50,000 మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సూర్యాపేట జిల్లా కోదాడ మార్కెట్ యార్డుకు మొక్కజొన్న తరలిస్తున్నట్లు వివరించారు. ప్రత్యామ్నాయ నిల్వల కోసం టేకులపల్లి ఉన్నత పాఠశాలలో తాత్కాలిక నిల్వలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా పెట్రాల చిలక గ్రామంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన రెండు గోదాములు ఉండగా వాటికి 10 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నట్లు వివరించారు. వెంటనే ఆ గోదాములను వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన అనుమతులు పొందాలని, తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం 148 మంది హమాలీలు అందుబాటులో ఉన్నారని అధికారులు తెలపగా, రవాణా కోసం తగినన్ని లారీలు ఏర్పాటు చేసి నిల్వల తరలింపును వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం బోడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో సుమారు 6 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. రవాణా ప్రక్రియపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, తగినన్ని లారీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, గత మూడు రోజులుగా ట్రాక్టర్లతో కొనుగోలు కేంద్రం వద్ద వేచి ఉన్నామని రైతులు తెలియజేయగా, వెంటనే స్పందించి ట్రాక్టర్లలో ఉన్న మొక్కజొన్నను కొత్తగూడెం మార్కెట్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తగినన్ని గన్ని బ్యాగులు సరఫరా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, రవాణా, గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిదంగా రవాణాకు ఇంత ఇబ్బంది అయినందున ట్రాన్స్పోర్టర్స్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను టేకులపల్లి పిఏసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబు రావు, మార్కెటింగ్ అధికారి నరేందర్, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు పిఏసిఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, ఇల్లందు, టేకులపల్లి తహసిల్దార్లు సూర్యనారాయణ, లంకపల్లి వీరభద్రం, ఇల్లందు ఎంపీడీఓ దన్ సింగ్, ఇల్లందు పిఏసిఎస్ సెక్రటరీ హీరాలాల్, కొనుగోలు కేంద్రాల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరపాలి

- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి : ఎస్ఎఫ్ఐ డిమాండ్




**భద్రాచలం, మే 13 (ప్రజాజ్యోతి):** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ టౌన్ సెక్రటరీ కొప్పుల రవీందర్ డిమాండ్ చేశారు. అలాగే నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.భద్రాచలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే నీట్ పరీక్షల నిర్వహణపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని పరీక్షలకు హాజరవుతుండగా, వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీ ఘటనలు వారి భవిష్యత్తును ఆందోళనలోకి నెడుతున్నాయని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణను రాష్ట్రాల పరిధి నుంచి తీసుకుని జాతీయ పరీక్షల సంస్థ ఆధీనంలో పెట్టడంతో పారదర్శకత లోపించిందని విమర్శించారు. గతంలో జరిగిన నీట్, నెట్ పరీక్షల పేపర్ లీకేజీ ఘటనల కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని తెలిపారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు వైద్య విద్యపై ఆశలు పెట్టుకుని ఎంతో కష్టపడి సిద్ధమవుతున్న సమయంలో పేపర్ లీకేజీ పేరుతో పరీక్షలపై అనిశ్చితి నెలకొనడం దురదృష్టకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించాలని డిమాండ్ చేశారు.విద్యా వ్యవస్థను కేంద్రీకరించడం వల్ల రాష్ట్రాల హక్కులు హరించబడుతున్నాయని, విద్యను వికేంద్రీకరించాలని కొప్పుల రవీందర్ అభిప్రాయపడ్డారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సురేష్, నాగేష్, బన్నీ సాయి, తరుణ్, విఘ్నేష్, రవి, వెంకటేశ్వర్లు, సతీష్, రమేష్, కుమార్, వేణు, నందు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సిఏ టుడే లీగ్‌కు ఎంపికైన చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ యువ క్రికెటర్లు



**భద్రాచలం, మే 13 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి చెందిన యువ క్రికెటర్లు హెచ్‌సిఏ టుడే లీగ్ క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం జిల్లా క్రీడా రంగానికి గర్వకారణంగా నిలిచింది. అకాడమీకి చెందిన రత్న ఆర్యన్, ప్రసన్న కుమార్, హర్షవర్ధన్ నాయుడు, సుహాస్ తమ ప్రతిభతో ఖమ్మం జిల్లా టీమ్‌లో చోటు దక్కించుకుని ప్రతిభ చాటుకున్నారు.ఈ సందర్భంగా అకాడమీ కోచులు చరణ్ తేజ, రవితేజ మాట్లాడుతూ, క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఈ స్థాయికి చేరుకున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన శిక్షణ అందించడం చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అంతేకాకుండా, క్రీడాకారులకు ఆధునిక శిక్షణా విధానాలు, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. చిన్న వయస్సులోనే క్రీడాకారులు ప్రతిభ కనబరచడం అకాడమీకి మరింత గుర్తింపు తీసుకొస్తోందన్నారు.హెచ్‌సిఏ టుడే లీగ్ వంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు ఎంపిక కావడం ద్వారా ఈ యువ క్రీడాకారుల భవిష్యత్తుకు మంచి అవకాశాలు ఏర్పడనున్నాయని క్రీడా నిపుణులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోచ్‌లు ఆకాంక్షించారు.క్రీడాకారుల ఎంపికపై ఖమ్మం జిల్లా క్రీడాభిమానులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అకాడమీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ను ఘన సన్మానం

- ఇల్లందు పట్టణ అధ్యక్షుడు, శ్రీహరి వాసం రియల్ ఎస్టేట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు హాజరు
- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**ఇల్లందు, మే 13, ప్రజాజ్యోతి:** మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన వెన్నం శ్రీకాంత్ రెడ్డిని బుధవారం మహబూబాబాద్ లో జరిగిన కార్యక్రమంలో ఇల్లందు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ డానియల్, శ్రీహరి వాసం రియల్ ఎస్టేట్ చైర్మన్ పెండేల హరికృష్ణ లు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు , రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయడంతో మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నియమించినట్లు తెలిపారు. వెన్నం శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి విశ్వసనీయ నాయకుడిగా, ప్రజలకు అందుబాటులో ఉండే సేవాభావి నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి ఆయన నాయకత్వంలో మానుకోట జిల్లాలో కొత్త దిశలో అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్రె శ్రీనివాస్, బెల్లంకొండ శ్రీనివాస్, మేకల శ్యామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన ఏపీడి విజయభాస్కర్ రెడ్డి



**టేకులపల్లి,మే13,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం తొమ్మిదో మైలు తండా గ్రామ పంచాయతీ కోటల్ల గ్రామంలోని మంచినీళ్ల కుంట చెరువు పూడికను ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్నపూడిక తిత పనులను బుధవారం ఉపాధిహామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ భాస్కర్ రెడ్డి పరిశీలించారు. ఏపిడి మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న మంచినీరు, నీడ, ప్రథమ చికిత్స సౌకర్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రతి కూలీ రూ.307 వేతనం పొందేలా నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు. కూలీలందరూ పనిముట్లతో హాజరుకావాలని,వేసవి దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రతి రోజూ 2 ఫోటోలు తప్పనిసరిగా దిగాలని తెలిపారు.ఒకరి బదులుగా మరొకరు ఎట్టి పరిస్థితుల్లో హాజరు కావద్దని తప్పు జరిగినట్లు తెలిస్తే సంబంధిత మేట్ల పై తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయి సిబ్బంది, సాంకేతిక సహాయకులు ప్రతి నిత్యం పనులు పరివేక్షిస్తూ వేజ్ సీకర్ లకు మార్కింగ్,ఈకెవైసి చేయాలని సూచించారు. తొమ్మిదో మైల్ గ్రామ పంచాయతీ లో ఏర్పాటు చేసిన నర్సరీను పరిశీలించారు. కార్యదర్శిని నర్సరీ సరిగ్గా నిర్వహించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ అధికారి రాజు, అదనపు కార్యక్రమ అధికారి, ఈజీఎస్ కాళంగి శ్రీనివాస్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఎం.తిరుపతి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ కుమారి,టీఏ సురేష్, ఎఫ్ ఏ భద్రం, మేట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నేత జానీ



**ఇల్లందు, మే 13, ప్రజాజ్యోతి:** ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదా రు వేం నరేందర్ రెడ్డి ని మాజీ టీపీసీసీ సభ్యు డు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎస్ కె జానీ బుధవారం మహబూబాబాద్ లో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి మారగాని శ్రీనివాస్ గౌడ్, మండల కిసాన్ ఖేత్ అధ్యక్షుడు బర్ల ప్రవీణ్, యువజన నాయకుడు సిరాజ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



**భద్రాచలం టౌన్ , మే 13 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బుధవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

# గిరిజన నిరుద్యోగ యువతకు వృతి నైపుణ్య శిక్షణకు ప్రతిపాదనలు సమర్పించాలి

- రాష్ట్రం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్



**భద్రాచలం టౌన్, మే 13 ప్రజాజ్యోతి** నిరుద్యోగులైన గిరిజన యువతి యువకులకు వృత్తి నైపుణ్యాలలో శిక్షణలు అందించి జీవనోపాధి పెంపొందించుకోవడానికి గ్రామ పంచాయతీలు, తండాల వారీగా యువతను గుర్తించ దానికి సంబంధించిన ప్రతిపాదనలు సోమవారం నాటికి సమర్పించాలని రాష్ట్రం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ ఐటీడీఏ పీవోలను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఐటీడీఏల వారీగా గిరిజన యువతి యువకులకు వివిధ కోర్సులలో శిక్షణ అందించడానికి చేపట్టవలసిన కార్యాచరణ గురించి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఐటిడిఏ వైటిసి ద్వారా నిరుద్యోగులైన గిరిజన యువతి యువకులకు వివిధ రకాల వృత్తి నైపుణ్యాల శిక్షణలు, ఉచిత వసతి సౌకర్యాలు కల్పించి అందించడానికి అనువుగా ఉండే భవనాలను గుర్తించాలన్నారు. ప్రతి ఐటీడీఏకు 2300 యువతీ యువకులకు అప్పరేల్ మేడ్ అండ్ హోం ఫర్నిచర్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ 400, బ్యూటీ మరియు వెల్నెస్ 250, అగ్రికల్చర్ ఫైనాన్స్ కార్పొరేషన్ 750, అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 250, టూరిజం మరియు హాస్పిటలిటి 400, నిమ్స్ ఎమ్మెస్ ఎం ఇ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ 250 మంది గిరిజన యువతి యువకులకు తప్పనిసరిగా నైపుణ్యాల శిక్షణ అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఏజెన్సీ మండలాలలోని గిరిజన గ్రామాలలో ఉన్న గిరిజన యువతి యువకులను సంబంధిత మండల అధికారులు అలాగే లోకల్ రిప్రజెంటేటివ్ పర్సన్లను ఎంపిక చేసుకొని నిరుద్యోగులైన యువతను గుర్తించి తప్పనిసరిగా శిక్షణలు అందించే విధంగా దానికి సంబంధించిన ప్రతిపాదనలతో పాటు వైటీసీలలో మైనర్ రిపేర్లకు సంబంధించిన వివరాలు కూడా సిద్ధం చేయాలని అన్నారు. ఈ నెలాఖరు నాటికి అన్ని ఐటీడీఏ పరిధిలోని వైటీసీలలో తప్పనిసరిగా యువతీ యువకులకు స్థానిక ప్రజాప్రతినిధులచే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వైటీసీలు అందుబాటులో లేని చోట ప్రవేట్ భవనాలను గుర్తించి శిక్షణలు అందించేలా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, వై టి సి ఇంచార్జ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి : భూక్య రమేష్



**కొత్తగూడెం, మే 13 ( ప్రజాజ్యోతి** ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయకుండా కాపాడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ప్రభుత్వ రంగ పరిరక్షణ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి, ఆర్టీసీ కార్మికులతో కలిసి బుధవారం వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా భూక్య రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రధాన ఆధారమని అన్నారు. వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను వ్యతిరేకిస్తూ కార్మికులు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ రంగంలో కార్మికులపై పనిభారం పెంచుతూ వేతనాలు తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం సీఐటీయూ సహా కార్మిక సంఘాలు ఉద్యమాలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సూరం ఐలయ్య, గుగులోత్ సక్రం, బత్తుల నాగేశ్వరరావు, రఫీ, శ్రీనివాస్, రాణి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

**ఇల్లందు, మే 13, ప్రజాజ్యోతి:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇల్లందు, టేకులపల్లి మండలాల విద్యా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలని కోరారు. విద్యార్థుల విజయాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలల కృషికి నిదర్శనమని కొనియాడారు. అనంతరం పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు, టేకులపల్లి యంఈఓలు ఉమా శంకర్, జగన్, రెండు మండలాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సర్పంచులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు మహమ్మద్ జాఫర్, షేక్ సైదు మియా, చిల్లా విజయ భారతి, మెరుగు కార్తిక్ యాదవ్, కోర్లపాటి శివకిరణ్, సోనీ భాయ్ కోరి, రాధ కమల్ కోరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## వృద్ధాశ్రమానికి 'నవ లిమిటెడ్' చేయూత

- భద్రాచలం సరోజ వృద్ధాశ్రమానికి గృహోపకరణాల పంపిణీ
- సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ చేతుల మీదుగా పంపిణీ








**భద్రాచలం టౌన్, మే 13, ప్రజాజ్యోతి** నవ లిమిటెడ్ పాల్వంచ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా మానవత్వాన్ని చాటుకుంది. భద్రాచలంలోని మానవసేవ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న 'సరోజ వృద్ధాశ్రమానికి' అవసరమైన వంట సామాగ్రి, మంచాలు, పరుపులు తదితర గృహోపకరణాలను బుధవారం అందజేసింది. ఈ కార్యక్రమానికి భద్రాచలం సబ్ కలెక్టర్ శ్రీ మృణాల్ శ్రేష్ఠ, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అండగా నిలిచిన 'నవ లిమిటెడ్' యాజమాన్యంఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధుల అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన వస్తువులను అందజేసిన నవ లిమిటెడ్ యాజమాన్యాన్ని అభినందించారు. సమాజ సేవా కార్యక్రమాల్లో సంస్థ ముందుండటం శుభపరిణామమని కొనియాడారు. సంస్థ డి.జి.ఎం (ఫైనాన్స్) శ్రీ ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ.. గత 46 ఏళ్లుగా విద్య, వైద్యం, జీవనోపాధి రంగాల్లో 'నవ' అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు.కృతజ్ఞతలు తెలిపిన ఆశ్రమ నిర్వాహకులుఆశ్రమ ప్రెసిడెంట్ శ్రీమతి సరోజ మాట్లాడుతూ.. వృద్ధుల ఇబ్బందులను నవ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగానే సానుకూలంగా స్పందించి.. వంట సామాగ్రితో పాటు దోమతెరలు, దుప్పట్లు, కండువాలను తక్షణమే అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవ సి.ఎస్.ఆర్ మేనేజర్ సి.హెచ్ శ్రీనివాసరావు, శ్రావణ్, సాయి, సంస్థ సిబ్బంది , ఆశ్రమ వృద్ధులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణా చేస్తే కఠినమైన చర్యలు తప్పవు

- ఎస్సై రాజేందర్
- ఐదుగురిపై బైండోవర్ కేసు




**టేకులపల్లి, మే13, ప్రజాజ్యోతి:** బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజేందర్ అన్నారు.బుధవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోలీస్‌శాఖకు సహకరించాలని సూచించారు.పశువుల కొనుగోలు, రవాణా,వధ ప్రక్రియలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, హైకోర్టు మార్గదర్శకాలు పాటించాలని,రవాణా సమయంలో జంతువులకు సరైన సంరక్షణ కల్పించాలని, తనిఖీల సమయంలో పోలీస్, వెటర్నరీ అధికారులకు సహకరించాలని ఆయన సూచించారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా నకిలీ లేదా చెల్లని వెటర్నరీ సర్టిఫికెట్లు ఉపయోగించ రాదని, అనుమతి లేని ప్రదేశాల్లో జంతువుల వధ,బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు జరుపరాదన్నారు. సోషల్ మీడియాలో మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే వీడియోలు, ఫొటోలు షేర్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.పండుగ సమయంలో ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సామరస్య వాతావరణం నెలకొనేలా నిర్వాహకులు వ్యవహరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలు అయినా ఉపేక్షించమని ఎస్సై రాజేందర్ హెచ్చరించారు. టేకులపల్లిలో పశువులను కొనుగోలు చేసే ఐదుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.ఎవరైన పశువుల అక్రమంగా వధకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించడం జరిగిందని ఆయన తెలిపారు. పశువులు అక్రమ రవాణా చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలుశిక్ష



**భద్రాచలం టౌన్ , మే 13 ప్రజా జ్యోతి** మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి జైలు శిక్ష ఖరారు చేస్తూ భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ బుధవారం తీర్పు వెల్లడించారు. చర్ల పోలీసు స్టేషన్‌లో 2015లో కొత్తపల్లి గ్రామంకు చెందిన లంజిపల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో విచారణ ముగియడంతో ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమాన విధిస్తూ తీర్పును వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ శ్రీనివాస్ వాదనలు వినిపించారు.

# నేటినుండి భగవద్గీత సప్తావాహం వేడుకలు

**చర్ల, మే 13(ప్రజా జ్యోతి ):**చర్లలోని శ్రీ వాణి విద్యానికేతన్‌లో నేటి నుండి 20 వ తేదీ వరకు భగవద్గీత సప్తావాహం వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడం, యువతకు భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, భగవద్గీత బోధనలపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఏడు రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 5:30 గంటల నుండి రాత్రి 7:30 గంటల వరకు భగవద్గీత పారాయణం, గీతా సందేశాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తి గీతాలు, ధార్మిక చర్చలు నిర్వహించబడనున్నాయి. భగవద్గీతలోని జీవన విధానం, కర్తవ్య నిబద్ధత, ధర్మ పరిరక్షణ, మానవ విలువలు, ఆత్మ విశ్వాసం వంటి అంశాలపై పండితులు ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ప్రస్తుత కాలంలో యువతలో పెరుగుతున్న మానసిక ఒత్తిడులు, సామాజిక సమస్యల నేపథ్యంలో భగవద్గీత బోధనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తాయని వారు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహక కమిటీ వెల్లడించింది. ఈ భగవద్గీత సప్తావాహం వేడుకలకు చర్ల పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక సందేశాలను గ్రహించి జీవితంలో ఆచరించాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9949926568, 9642225798, 9966871712, 9603784789, 9394772684, 6304590083, 9398664001 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# కంఠమహేశ్వరుని ప్రాణప్రతిష్టాపన

- ఘనంగా ప్రతిష్ట మహోత్సవం
- బోనాల ఊరేగింపు



**గుండాల మార్చి 13 ప్రజా జ్యోతి** కంట మహేశ్వర స్వామి, సురమాంబ, ఎల్లమ్మ, వనమైసమ్మ, ల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సొంత ముందు గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కంఠమహేశ్వర స్వామి గుడి ప్రతిష్ట బుధవారం రంగ రంగ వైభవంగా నిర్వహించారు. కౌడిన్య రాజు, సమ్మయ్య ల ఆధ్వర్యంలో, సాయి, సనత్ పూజారులచే పూజలు నిర్వహించి ప్రతిష్ట చేశారు. అనంతరం అక్కడికి చేరుకున్న భక్తులకు మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు వందలాదిగా వచ్చిన భక్తులు మహా అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు సాయంత్రం బోనాలతో మహిళలు ఊరేగింపుగా గుడి వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు రాత్రి స్వామి వారి కళ్యాణం, మత్స్య కొలుపు, గావు కొలుపు బలిదానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో బత్తిని సాయన్న , యాసారపు వెంకన్న, బత్తిని రమేష్, గుండెబోయిన లక్ష్మీనారాయణ, తీగల ముఖేష్, బుసన్న బోయిన సమ్మయ్య, బొబ్బిలి రమేష్, యాసారపు సురేష్, బొంగు సిద్దయ్య, మొక్క నరేందర్, బొబ్బిలి శ్రావణ్, మాచర్ల రంజిత్ , వంశీ, యాసారపు తిరుపతి, యాకయ్య, మొక్క ప్రశాంత్, నాలం రాము, పాలకుర్తి శేఖర్, బాల్య రాము, పల్లెర్ల రవి వర్మ, మొక్క చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా

- పంచాయతీ గుమస్తాకు తీవ్ర గాయాలు
- భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలింపు



**చర్ల, మే 13(ప్రజా జ్యోతి ):**చర్ల మండలం గోంపల్లి గ్రామంలో పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో పంచాయతీ గుమస్తా తీవ్రంగా గాయపడ్డాడు.మంగళవారం సాయంత్రం గ్రామంలో త్రాగునీటి సరఫరా కోసం వాటర్ ట్యాంకర్‌లో నీళ్లు నింపుకొని ప్రజలకు అందిస్తున్న సమయంలో ఒక్కసారిగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న గోంపల్లి గ్రామ పంచాయతీ గుమస్తా ప్రేమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి అతడిని చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.పంచాయతీ ట్రాక్టర్లను అనుభవం ఉన్న డ్రైవర్లతో కాకుండా డ్రైవింగ్ తెలియని వారితో నడిపించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు అన్నారు.

# డిగ్రీ కళాశాల అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తా

- సర్పంచ్ పూణేం కృష్ణ

**భద్రాచలం టౌన్, మే 13 ప్రజాజ్యోతి** భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని, కళాశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక సర్పంచ్ పూణేం కృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా బుధవారం కళాశాలలో మూడవ రోజు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి అంశాలపై నిర్వహించిన ఈ సదస్సులో ఆయన 7వ వార్డు సభ్యుడు కావూరి గోపితో కలిసి పాల్గొన్నారు.నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలిఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా తమలోని సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. అనంతరం వార్డు సభ్యుడు కావూరి గోపి మాట్లాడుతూ.. తాను కూడా ఇదే కళాశాల విద్యార్థిని కావడం గర్వకారణమని, కళాశాల పురోభివృద్ధికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.సర్పంచ్, వార్డు సభ్యులకు ఘన సన్మానం కళాశాల పట్ల ప్రత్యేక చొరవ చూపుతున్న సర్పంచ్ పూణేం కృష్ణ, వార్డు సభ్యుడు కావూరి గోపిలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జాన్ మిల్టన్ శాలువాలతో సత్కరించి, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# గ్రామాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలి
- మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి





**ములకలపల్లి, మే 13, ప్రజాజ్యోతి:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం మండలం పరిధిలోని మూకమామిడి గ్రామపంచాయతీలో మొగరాల గుప్ప యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఆమె తన సొంత నిధులతో వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. గ్రామంలోని ఆరు జట్ల యువకుల కోసం మూడు వాలీబాల్ నెట్లు, మూడు వాలీబాల్స్, 36 జెర్సీలను అందజేశారు. సర్పంచ్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామాన్ని మత్తు పదార్థాల రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. గ్రామ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా యువకులు, క్రీడాకారులు కలిసి సర్పంచ్ ఆదిలక్ష్మితో పాటు వార్డు సభ్యులు తనం పావని, కీసర రాజ్ కుమార్, కోర్సా శ్రీకృష్ణలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆదిలక్ష్మి సహకారంతో త్వరలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు యువజన నాయకుడు కోర్సా రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో పాటు ఆరు గ్యారెంటీలు అమలుచేయాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా




**బూర్గంపహాడ్, మే 13 (ప్రజా జ్యోతి):** అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చా వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ లో వ్యవసాయ కార్మికులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ విడత మంజూరు చేసే ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకే ఇవ్వాలని, ఇంటి స్థలం లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12వేల చొప్పున తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని పూర్తిస్థాయిలో అమలుచేయాలని, కేంద్రం ఏకపక్షంగా తీసుకువచ్చిన వీబీజీ రామ్జీ చట్టాన్ని రద్దుచేయాలని, మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో 15న దేశవ్యాప్తంగా ఉపాధి కార్మికుల సమ్మె జరుగుతుందని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కి అందజేశారు. తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్ పేదల సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన పేదలకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్కే. అబీద, బయ్యా రాము, మరియమ్మ, చిన్నమ్మాయి, పద్మ, కనకదుర్గ, కుర్సా తిరుపతయ్య, మంగ, మీనా, శివ తదితరులు పాల్గొన్నారు.

## మూకమామిడికి బీటీ రోడ్డు మంజూరు

- ఆర్టీసీ బస్సు పునఃప్రారంభానికి మార్గం సుగమం
- ఎమ్మెల్యే జారే, మంత్రి పొంగులేటి కి కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి




**ములకలపల్లి, మే 13, ప్రజాజ్యోతి:** మూకమామిడి గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృషితో గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైందని మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి తెలిపారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ, గ్రామ రోడ్డు దుస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి మంత్రి సహకారంతో బీటీ రోడ్డు మంజూరు చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు సరిగా లేకపోవడంతో గతంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసు, బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత పునఃప్రారంభం కానుందని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణంతో విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులకు రాకపోకలు సులభం కానున్నాయని తెలిపారు. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయని, ప్రారంభ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నారని పాలకవర్గం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు సున్నం భద్రమ్మ, కనితి చిన్న వెంకటేశ్వర్లు, బచ్చల చైతన్య కుమారి, భూక్య మంగమ్మ, తనం పావని, కీసరి రాజ్‌కుమార్, కోర్సా శ్రీకృష్ణ, కోడిమే ముత్తయ్య పాల్గొన్నారు.

## ధాన్యం రవాణాకు లారీలు సమకూర్చని కాంట్రాక్టర్ పై కేసు నమోదు చేయాలి

- పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేంద్రావు డిమాండ్



**టేకులపల్లి,మే13,ప్రజాజ్యోతి:** ధాన్యం రవాణాకు లారీలు సమకూర్చడానికి ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ పై కేసు నమోదు చేయాల్సి పిఏసిఎస్ చైర్మన్ లక్కినేని సురేంద్రరావు కలెక్టర్ తెలియజేశారు. బుధవారం టేకులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మొక్కజొన్న కొనుగోలు జరుగుతున్న కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పిఏసిఎస్ చైర్మన్ లక్కినేని సురేంద్రరావు మాట్లాడుతు కొనుగోలు కేంద్రాల నిర్దేశిత సమయంలో మొక్కజొన్న తరలించేందుకు సకాలంలో లారీలు సమకూర్చడానికి ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా టేకులపల్లి,బోడు రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. వర్షాకాలంలో రైతులకు పత్తి దెబ్బ తీయడం వల్ల, రైతుల మొక్కజొన్న పంటను సాగు చేయడం జరిగింది. దేవుడు కరుణించి రైతులు పండించిన పంట మంచి దిగుబడి రావడంతో ప్రైవేట్ వ్యాపారులకు అమ్మడం రూపాయ తక్కువ వస్తుందని, గవర్నమెంట్ తరఫునుంచి సొసైటీ కుంటున్న కేంద్రాలలో రైతులు అమ్ముకోవడం జరిగింది. ఈ ధాన్యకు సకాలంలో లారీలను కొనుగోలు కేంద్రానికి పంపించకుండా జాప్యం చేస్తూ గొప్పతనం కోసం టెండర్లు వేయడం జరిగిందని ఆయన ఆరోపించారు. టెండర్లు సొంత వాహన నెంబర్లను జమ చేసి టెండర్ వేయాల్సి ఉంది. కానీ సంబంధం లేని లారీ నెంబర్లను వేసి టెండర్లు తీసుకొని ఇలా ప్రభుత్వం ధాన్యం మొక్కజొన్నలను వానాల పాలు చేస్తూ రైతుల్ని ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రతి ఏటా వారికి ఎందుకు టెండర్ పోతుందని ప్రశ్న ఉత్పన్నమవుతుందని ఆయన అన్నారు. ఇవన్నీ కలిపి దృష్టిలో పెట్టుకొని, ఇతనిపై సమగ్రహ విచారణ జరిపి రైతులను ఇబ్బంది పెట్టినందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## బండి సంజయ్ కుటుంబం పై రాజకీయ దుష్ప్రచారం మానుకోవాలి

- బిజెపి మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ నాయక్



**ములకలపల్లి, మే 13, ప్రజాజ్యోతి:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుటుంబం పై బి ఆర్ ఎస్ పార్టీ చేస్తున్న రాజకీయ దుష్ప్రచారాన్ని బిజెపి మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ నాయక్ ఖండించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి తనయుడు బండి సాయి భగీరథను అరెస్టు చేయాలంటూ మంగళవారం బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన రాజకీయ ప్రేరేపితమైందని ఆయన ఆరోపించారు. ఎవరు తప్పు చేసిన చట్టం తన పని తాను చేస్తుందని, నిజాలు బయటకు వచ్చిన తరువాత తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని అన్నారు. బి ఆర్ ఎస్ పాలనలో జరిగిన ఘటనలపై స్పందించని నాయకులు ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డురంగా ఉందన్నారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి కేంద్ర మంత్రిగా ఎదిగిన బండి సంజయ్ పై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పూనేం నవీన్ కుమార్, అత్యం మణికంఠ సాయి, యర్రంశెట్టి శ్రీనివాస్, సాయిల శ్రీనివాస్, కుంజా జగన్, తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ చూడొద్దు అన్న తల్లి మనస్థాపంతో యువతి ఆత్మహత్య



**ములకలపల్లి, మే 13, ప్రజాజ్యోతి:** సెల్ ఫోన్ ఎక్కువగా చూడొద్దని తల్లి మందలించడంతో మనస్తాపం చెంది 19 ఏళ్ల యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, సీతారాంపురానికి చెందిన కొంద్రు అశ్విని(19) హైదరాబాద్‌లో కంప్యూటర్ కోర్సు పూర్తి చేసి వారం క్రితమే ఇంటికి వచ్చింది. ఇంట్లో ఉంటూ ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌తో గడుపుతోంది. మంగళవారం అశ్విని అమ్మమ్మ అనారోగ్యానికి గురికావడంతో తల్లి నాగమణి జగన్నాథపురంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. వెళ్లేముందు అశ్విని "సెల్‌ఫోన్ చూడకుండా ఇంటి పనులు పూర్తి చేయి" అని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన అశ్విని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అశ్విని మృతి చెంది. యువతి తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్సై మధుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం

- 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో తొలిగిన ఇక్కట్లు
- మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కమిషనర్‌లకు ధన్యవాదాలు తెలిపిన 10వ వార్డు కౌన్సిలర్ మిండా హరిబాబు



**అశ్వారావుపేట, మే 13 (ప్రజాజ్యోతి):** పట్టణంలోని 10వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. స్థానిక ప్రజలు చాలా కాలంగా ఎదుర్కొంటున్న తక్కువ వోల్టేజ్, తరచూ విద్యుత్ అంతరాయం సమస్యలను దృష్టిలో ఉంచుకుని 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో వార్డులో విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 10వ వార్డు కౌన్సిలర్ మిండా హరిబాబు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ రమేష్, కమిషనర్ దీపక్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు మున్సిపల్ పాలకవర్గం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇకపై విద్యుత్ సమస్యలు లేకుండా ప్రజలు సౌకర్యంగా ఉండగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వ్యాక్సినేషన్ సేవలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక పర్యవేక్షణ



**పాల్వంచ, మే 13, ప్రజాజ్యోతి** :భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ ఆదేశాల మేరకు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో జగన్నాథపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పినపాక పట్టినగర్, సంగం, నాగారం ఆరోగ్య ఉపకేంద్రాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాలపై పర్యవేక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ సేవల అమలు తీరు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, వ్యాక్సిన్ నిర్వహణ విధానాలను పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచనలు చేశారు.టీకాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సమయానికి వ్యాక్సినేషన్ అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నాగభూషణం, హెచ్ఎస్ కృష్ణయ్య పాల్గొన్నారు.